క్లుప్తంగా

మున్నూరుకాపుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



మహేశ్‌ను సన్మానిస్తున్న మున్నూరుకాపులు

గన్నేరువరం: మున్నూరుకాపుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకు కృషి చేస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి కొనగాల మహేశ్ అన్నారు. మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనం గన్నేరువరంలో సోమవారం నిర్వహించగా ముఖ్యఅతిథిగా మహేశ్ హాజరయ్యారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మున్నూరుకాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, బడ్జెట్‌లో నిధుల కేటాయించారని తెలిపారు. కార్పొరేషన్‌కు మరిన్ని నిధులు తీసుకొచ్చి రాష్ట్ర వ్యాప్తంగా మున్నూరుకాపులను మరింత అభివృద్ధి పథంలో నడిపించడానికి తనవంతు ప్రయత్నం చేస్తానని మహేశ్ పేర్కొన్నారు. కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే, సుడా చైర్మన్ సహాయ సహకారాలు తీసుకుంటామన్నారు. నూతనంగా ఎన్నికైన సంఘం సభ్యులను సన్మానించి, అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సునీల్, రాష్ట్ర కార్యదర్శి బాలయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకన్న, ఉపాధ్యక్షుడు రవి, గ్రామశాఖ అధ్యక్షుడు బాలయ్య, భూమయ్య, ప్రకాష్, నగేశ్, నర్సయ్య, రాము, కనుకయ్య, రవి, శ్రీను, మల్లేశం, సత్తయ్య, కనుకయ్య, రాజేశం, రమేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేరెళ్ల శారదను కలిసిన పీఆర్టీయూ నాయకులు



సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను పీఆర్‌టీయూ నాయకులు సోమవారం కలిసి సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, గంగాధర, రామడుగు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్యాంసుందర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా మహిళా ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె వద్ద ప్రస్తావించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

బీమా చెక్కు అందజేత



దేవేంద్రకు చెక్కు అందిస్తున్న దిలీప్

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన జున్నూరి శ్రీనివాస్ కుటుంబానికి పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు చెంచల దిలీప్ బీమా చెక్కు అందించారు. సోమవారం సంఘం కార్యాలయం ఆవరణలో శ్రీనివాస్ భార్య దేవేంద్రకు రూ.42,095 చెక్కు ఇచ్చారు. కాగా శ్రీనివాస్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా సంఘం నుంచి బీమా చెక్కు మంజూరైందన్నారు. కార్యక్రమంలో సైదాపూర్ పొదుపు సమితి అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, సమితి గణకుడు అనకొండ వీరన్న, పొదుపు సంఘం ఉపాధ్యక్షుడు రాజేందర్, పాలకవర్గం సభ్యులు చెంచల భీమయ్య, సురేశ్, వెంకటేశ్, రమేశ్, తిరుపతి, రవీంద్రాచారి, అంజయ్య, తిరుపతి, రమేశ్ ఉన్నారు.

ఆర్థికసాయం



గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామానికి చెందిన గుంటుక కాళిదాస్ ఇటీవల ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులను మండల పద్మశాలీ సంఘం సభ్యులు సోమవారం పరామర్శించారు. అనంతరం రూ.రెండువేలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు గుంటుక లింగయ్య, కేశవులు, రవి, రాజేశం, జక్కని మురహరి పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించాలి

హుజూరాబాద్‌రూరల్: రాష్ట్రంలోని విద్యా సంస్థలకు ప్రభుత్వం ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని ఏఐఎస్‌బీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ కొలుగూరి సూర్యకిరణ్ సోమవారం ప్రకటనలో కోరారు. విద్యా రంగంలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం పట్ల ప్రభుత్వానికి విద్యా రంగంపై ఉన్న స్పష్టత ఏంటో తెలుస్తుందన్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యా సంస్థలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

- రైతులు సన్నరకం వడ్లు సాగుచేయాలి
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



రేణికుంటలో కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

తిమ్మాపూర్: రైతులు సన్నరకం వడ్లు ఎక్కువగా సాగు చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సన్న రకం ధాన్యానికి మార్కెట్లో డిమాండ్ ఉందని, సన్నరకం బియ్యాన్ని ప్రజలు ఇష్టపడుతున్నందున రైతులు కూడా సన్నాల సాగుపై దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తుందని, రూ.500 బోనస్ ఇస్తోందని గుర్తు చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి ఇబ్బంది పడకుండా ఉండేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతుల డిమాండ్ మేరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ మాట్లాడుతూ.. ధాన్యం తూకంలో మోసాలకు తావు లేదని స్పష్టం, తాలు, తరుగు పేరిట కోత ఉండవని, ఒకవేళ ఉంటే తన దదృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు తెలకపల్లి రాజు, కృష్ణబాబు, నాయకులు బి.రాజు, జ్యోతి, శ్రీధర్, కొండలరావు, తిరుపతిరెడ్డి, కె.సంపత్, శ్రీకాంత్, సుధాకర్‌రెడ్డి, బి.సుధాకర్, మామిడి అనిల్, డి.లింగారెడ్డి, పి.చిరంజీవి, అంకూస్ అధికారులు పాల్గొన్నారు.

పూలే విగ్రహం ధ్వంసంపై నిరసన



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

హుజూరాబాద్‌రూరల్: వరంగల్ జిల్లా దేశాయిపేటలో మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మహాత్మాజ్యోతిరావు పూలే ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ సందెల వెంకన్న ఆధ్వర్యంలో సోమవారం ప్రజాసంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో ప్రజా సంఘాల నాయకులు చందుపట్ల జనార్దన్, పసుల స్వామి, మాడుగుల ఓదెలు, ములుగు రవి, ఏనూరి అశోక్, తాళ్లపల్లి అమరేందర్, కోడూరి సమ్మయ్య, చల్లూరి రాజు, సిరికొండ సమ్మయ్య, గిరవేణి శ్రీకాంత్, మిడిదొడ్డి రాజు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించొద్దని వినతి



వినతిపత్రం ఇస్తున్న దిలీప్‌కుమార్, రాజు

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువు శిఖం భూమిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు నిలిపివేయాలని గ్రామానికి చెందిన తాటికంటి దిలీప్‌కుమార్, రాజు తహసీల్దార్ రమేశ్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. చెరువు పరిధిలో విద్యుత్‌శాఖ అధికారులుఎకరం భూమిలో సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడుతున్నారని, భవిష్యత్‌లో గ్రామానికి ప్రమాదం పొంచి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెరువు భూములు కాపాడాలని హైడ్రా తీసుకువచ్చి, అక్రమ నిర్మాణాలు కూల్చేస్తుంటే, కోరపల్లిలో అవేమి పట్టడం లేదన్నారు. నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్, అనుమతులిచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. తహసీల్దార్ రమేశ్ సానుకూలంగా స్పందించి సర్వే చేసి భూమి అన్యక్రాంతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

హామీలు అమలుకాక ఆందోళనలో అన్నదాతలు

గంగాధర: మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతన్నల నోట్లో మట్టి కొడుతుందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. మండలంలోని బూరుగుపల్లిలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి పదినెలలు పూర్తి కావస్తున్నప్పటికీ రైతులకు పెట్టుబడి సాయం అందించడంలేదని, రూ.రెండు లక్షల రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలుకాక రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను నిందిస్తున్నారే తప్పా రైతుభరోసా అమలు చేయడం లేదని, రైతులు పండించిన ధాన్యంకు బోనస్ అందజేయాలని, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పరామర్శ

రామడుగు: రోడ్డు ప్రమాదంలో గాయపడి కరీంనగర్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న దంపతులు అలువాల విష్ణు, రమ్యకృష్ణను సోమవారం సాయంత్రం రవిశంకర్ పరామర్శించారు. ప్రమాద విషయాలను కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్నారు. కార్యక్రమంలో యువజన సంఘాల ప్రతినిధులు రేండ్ల కళింగశేఖర్, కిరణ్, శ్రీనివాస్, కమలాకర్ పాల్గొన్నారు.

రైతు భరోసా ఎప్పుడు ఇస్తారు?

సైదాపూర్: వానాకాలం సాగు పూర్తి కావస్తున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా ఊసెత్తడంలేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ప్రజాపాలన నిర్వహిస్తామని ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తున్నారని, ధాన్యానికి బోనస్, రైతుభరోసా పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు.

క్రైం వార్తలు

దాడి చేసినవారిపై కేసు

జమ్మికుంట: దాడి చేసిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి సోమవారం తెలిపారు. మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన ఉడుత గట్టయ్య అదే గ్రామానికి చెందిన ఐలపురం హరీశ్‌కు ఏడాది క్రితం రూ.ముప్పైవేలు అప్పుగా ఇచ్చాడు. ఆదివారం రాత్రి డబ్బులు ఇస్తానని ఇంటికి పిలిచాడు. ఇంట్లోకి వెళ్లిన తర్వాత డబ్బులు అడుగుతావా అంటూ బీరు సీసాతో దాడికి పాల్పడగా తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు హరీశ్‌పై కేసు నమోదు చేశామని సీఐ వివరించారు. మండలంలోని వావిలాల గ్రామ పంచాయతీ పరిధి గోపాలపురం గ్రామానికి చెందిన ఐలపుర మహేశ్‌ను అదే గ్రామానికి చెందిన ఉడుత గట్టయ్య, కిరణ్, హరీశ్, సూదుల ప్రశాంత్ ఆదివారం రాత్రి ఇంటికి వచ్చి బూతులు తిడుతూ, తలుపులు పగలగొట్టి దాడికి పాల్పడ్డారు. బాధితుడి భార్య ఐలపురం మౌనిక ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

గంగాధర: మండలంలోని వెంకటాయిపల్లి గ్రామానికి చెందిన రావుల సత్యనారాయణపై అదే గ్రామానికి చెందిన రావుల సత్తయ్య దాడి చేసి గాయపరచగా కేసు నమోదు చేశామని గంగాధర ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో దుర్గామాత నిమజ్జన ఉత్సవంలో మహిళలు డ్యాన్స్ చేస్తుండగా సత్తయ్య మద్యం తాగి వారితో కలిసి డ్యాన్స్ చేయగా సత్యనారాయణ అభ్యంతరం తెలిపాడు. దీన్ని మనసులో పెట్టుకొని సత్తయ్య దాడి చేయడంతో సత్యనారాయణ గాయాలపాలయ్యాడు. ఘటనపైన కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

విద్యుత్ మోటార్లు చోరీ

శంకరపట్నం: మండలంలోని అర్కండ్ల గ్రామంలో వాగులో ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ మోటార్లు చోరీకి గురయ్యాయని రైతులు తెలిపారు. గ్రామానికి చెందిన నేదురు భూమయ్య, చిలువేరు చంద్రయ్య వాగు నుంచి మోటార్లతో సాగు నీరు విని యోగించుకుంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి దొంగలు మోటార్లను ఎత్తుకెళ్లారని సోమవారం తెల్లవారుజామున వాగువద్దకు వెళ్లిన రైతులకు మోటార్లు కనిపించకపోవడంతో చోరీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట: మానేరు వాగు నుంచి విలాసాగర్ గ్రామానికి చెందిన రాచపల్లి రామస్వామి అక్రమంగా ట్రాక్టర్‌తో ఇసుక తరలిస్తుండగా పోలీసులు మున్సిపల్ పరిధి కొత్తపల్లి చౌరస్తా వద్ద పట్టుకున్నారు. ఈమేరకు సోమవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

గన్నేరువరం: అధిక చార్జీలతో ఇబ్బందులకు గురిచేస్తున్న మండల కేంద్రంలోని మీ సేవా కేంద్రాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ నరేందర్‌కు సోమవారం ఫిర్యాదు చేశామని మాదాపూర్ గ్రామానికి చెందిన సంపతి ఉదయ్‌కుమార్ తెలిపారు. నిర్వాహకులు గంటలపాటు వేచి ఉండేలా చేస్తున్నారని, దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని, ఒకే ఐడీపై రెండు మీ సేవా కేంద్రాల నిర్వహిస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

తిమ్మాపూర్: మండలంలోని మొగిలిపాలెం గ్రామ శివారులో సోమవారం ఓ ట్రాక్టర్ అదుపు తప్పి పొలంలో బోల్తాపడింది. పర్లపెల్లికి చెందిన ట్రాక్టర్ మొగిలిపాలెం నుంచి కరీంపేట వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి పాకాల శ్రీనివాస్ పొలంలో బోల్తా పడింది. డ్రైవర్ బాగోతం కొమురయ్యకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

వైద్య విద్యార్థినికి అభినందనలు



సుస్మితను అభినందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన అమిరిశెట్టి సుస్మిత బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడికల్ (బీఏఎంఎస్) పట్టా అందుకున్న సందర్భంగా సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం క్యాంపు కార్యాలయంలో అభినందించారు. సుస్మిత కర్ణాటకలోని ఉస్మానాబాద్ రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్‌సైన్స్ నుంచి పట్టా పొందారు. ఆమె తండ్రి సుధాకర్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

పరామర్శ

జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధి మ్యాకవెంకయ్యపల్లి గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని గోపాల్‌రావుపేటకు చెందిన జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణును సోమవారం ఎమ్మెల్యే సత్యం పరామర్శించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అంజనీప్రసాద్, మాజీ సర్పంచ్ కోల రమేశ్, జాతీయ యువజన అవార్డు గ్రహీత రేండ్ల కళింగ శేఖర్ పలువురు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద ప్రజాస్వామిక సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ప్రొఫెసర్ సాయిబాబా మృతిపట్ల కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. తెలంగాణ, బహుజనుల హక్కుల కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. మానవ హక్కుల రాష్ట్ర కార్యదర్శి డా.తిరుపతయ్య, తెలంగాణ హమాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు సామ్రాజ్యం, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరహరి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు భరత్, టీపీటీఎఫ్ నాయకులు అవినాశ్, తదితరులు పాల్గొన్నారు.

హద్దులు నిర్ణయిస్తాం

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని చెరువు, కుంటల హద్దులను త్వరలోనే నిర్ణయిస్తామని తహసీల్దార్ కె.కనకయ్య అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో భూములు ఉన్నాయో లేదో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో హద్దులను నిర్ణయించనున్నామని, పట్టణంలోని మోడల్ చెరువు, గుండ్ల చెరువు, గంగోని కుంటలతోపాటు పలు కుంటలు ఏ సర్వే నంబర్లలో చెరువు, కుంటలు ఉన్నాయో వాటి విస్తీర్ణం, కొలతలు వేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ఎలాంటి అనుమానాలు ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారుల ద్వారా సందేహాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు.

అపోహలు వద్దు



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

మానకొండూర్: పది రూపాయల నాణెములు చెల్లుబాటులో ఉన్నాయని యూనియన్ బ్యాంకు మానకొండూర్ బ్రాంచ్ మేనేజర్ మహమ్మద్ అర్షర్ అలీ సోమవారం తెలిపారు. కాయిన్స్‌పై ఎలాంటి అపోహలు వద్దని మండల కేంద్రంలో ప్లకార్డులతో వ్యాపారులు, ప్రజలకు బ్యాంకు అసిస్టెంటు మేనేజర్ దర్శన్‌తో కలిసి అవగాహన కల్పించారు. నాణాలు చెల్లవనే వార్త అవాస్తవమని అన్నారు.

అనర్హులను గుర్తించాలి



వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

గన్నేరువరం: మండలంలోని వివిధ గ్రామాల్లో అనర్హులైన పెన్షన్‌దారులను గుర్తించి వెంటనే తొలగించాలని సీపీఐ నాయకులు సోమవారం ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అర్హులకు మాత్రమే పింఛన్ అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి శ్రీశైలం, కోశాధికారి శ్రీనివాస్, నాయకులు మల్లయ్య, మల్లయ్య, కిష్టయ్య, ఎండీ నాయిమ్ పాల్గొన్నారు.

సన్మానం

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ జామే మసీద్, ఈద్గా కబరస్థాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్‌ను సోమవారం కరీంనగర్ పట్టణానికి చెందిన ప్రముఖ జనాబ్ గయాసుద్దీన్ శాలువాతో సన్మానించారు. హుజూరాబాద్ జామే మజీద్, ఈద్గా కబరస్థాన్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలో విజయం సాధించినందుకు సత్కరించారు.

విజయవాడకు మాలధారణ భక్తుల పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

జమ్మికుంట: దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మాలధారణ భక్తులు విజయవాడ కనకదుర్గ సన్నిధికి కాలినడన బయలుదేరారు. మున్సిపల్ పరిధి కొత్తపల్లికి చెందిన యువకులు మారుతిరెడ్డి, ప్రశాంత్, మహేశ్ సోమవారం స్థానిక శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయంలో భక్తి శ్రద్ధలతో పూజలు చేసి పాదయాత్ర ప్రారంభించారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకొని మాల విరమణ చేస్తామని తెలిపారు. కొత్తపల్లి యువశక్తి యూత్ అసోసియేషన్ సభ్యులు భవానీ భక్తుల ప్రయాణం సజావుగా సాగాలని వేడుకున్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు ఐత శ్రీనివాస్, సోనియా, సమత, మల్లికార్జున్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



గన్నేరువరం: మండలంలోని సాంబయ్యపల్లె గ్రామంలో ఉన్న కన్‌రెడ్డికుంట తూము లీకేజీతో నీరంతా వృథాగా పోతోందని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ఇననైనా స్పందించి లీకేజీకి మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజ్‌కుమార్, నీటిపారుదలశాఖ ఏఈ, సెల్ నంబర్: 99519 26731

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9848408781, 8790144227, 9553955664

విజేతలకు బహుమతులు అందజేత



విజేతలతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గాజుల నందన్ స్మారకార్థం నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో విజేతలకు సోమవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బహుమతులు అందించారు. కేశవపట్నం గ్రామానికి చెందిన పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్–రమాదేవి దంపతుల కొడుకు నందన్ స్మారకార్థం పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బస్వయ్య, బీజేపీ మండ అధ్యక్షుడు అనిల్, మాజీ సర్పంచ్ రాజకొంరయ్య, సదానందం, తిరుపతి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతి.. అధిక దిగుబడి



మల్చింగ్, స్టేకింగ్ పద్ధతిలో సాగు చేసిన మిరపతోట

- మిరపసాగులో లాభాలు గడిస్తూ ఆదర్శంగా నిలిస్తున్న రైతు
- ప్రతికూల పరిస్థితుల్లో నష్టపోని వైనం



ఏపుగా కాసిన మిరపను చూపుతున్న రైతు

గంగాధర: భారీ వర్షాలతో పాటు అడపాదడపా కురుస్తున్న వర్షాలకు కూరగాయల సాగు రైతులకు సవాలుగా మారింది. ఆరుగాలం శ్రమిస్తున్న రైతులు వర్షాల కారణంగా దిగుబడి తగ్గడంతో పాటు నాణ్యమైన పంటను పొందలేక పోతున్నారు. ఇలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సరికొత్త సాగు విధానాలను పాటిస్తూ మామిడితోటలో అంతరపంటగా పచ్చిమిరప సాగుచేస్తూ అధిక దిగుబడి సాధిస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు మండలంలోని ర్యాలపల్లి గ్రామానికి చెందిన పాలసాని కిరణ్‌రావు అనే రైతు.

అందరిలాగే కూరగాయలు సాగు చేస్తే నామమాత్రపు దిగుబడి రావడంతో పాటు పెట్టుబడి రాక ఆధునిక పద్ధతుల్లో మిరప సాగు చేయడానికి శ్రీకారం చుట్టాడు. రెండెకరాల్లోని మామిడితోటలో 25 గుంటల్లో అంతరపంటగా మిరప సాగు చేయడానికి సిద్ధమయ్యాడు. సింగిల్ సూపర్ పాస్ఫేట్, పొటాష్, పశువుల పేడ దుక్కిలో వేసి సేంద్రీయ కర్బనం పెంచాడు. వర్షాకాలంలో సొంతంగా నారు పెంపకానికి ఇబ్బంది ఏర్పడంతో నర్సరీ నుంచి తెచ్చిన మిర్చినారును పెంచాడు. పొలంలో నీరు నిల్వ ఉండకుండా చేను చుట్టూ నీరు బయటకు వెళ్లే విధంగా కందకం తీయించాడు. దుక్కి దున్ని చదును చేసిన తర్వాత ట్రాక్టర్ సహాయంతో ఎత్తయిన బోదెలు తయారు చేయించాడు. కలుపు నివారణకు బోదెలపై మల్చింగ్ సీటు వేయించాడు. మొక్కలు నాటిన తరువాత డ్రిప్ పద్ధతిలో మొక్కకు అవసరమైన పోషకాలు అందిస్తూ తోటను ఏపుగా ఆరోగ్యకరంగా పెంచాడు. అధిక వర్షాలతో పాటు గాలులకు మొక్కలు కింద పడిపోకుండా ఉండటానికి స్టేకింగ్ విధానంలో సాలుకు ఇరువైపులా కర్రలతో సపోటు తయారు చేశాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూరగాయల సాగు చేసిన ఇతర రైతులు నష్టపోయినా తనపంటకు నష్టం జరగలేదని రైతు పేర్కొన్నాడు. ఇప్పటి వరకు మిర్చి పంటను రెండు కోతలు కోయగా మొదటి విడత దాదాపు 15 క్వింటాళ్లు, రెండో విడత 35 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని ధర తక్కువగా ఉండటంతో పెట్టుబడి వచ్చింది లేకుంటే రెండో కాత నుంచి లాభాలు వస్తున్నాయని, పంట పూర్తికాలంలో పది కోతలు వస్తాయని, ప్రతీ కోతకు ముప్పై నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, మార్కెట్‌లో రేటును బట్టి లాభాలు ఆర్జించవచ్చని రైతు వివరించాడు. ఆధునిక పద్ధతిలో కూరగాయలు సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపాడు.